ప్రచురణ తేదీ : 05-14-2019 రచయిత పేజీని సమర్పించినవారు:______


# కొత్తపల్లి వీరభద్ర రావు


## అవతారతత్త్వ వివేచన

"పరాకృత నమద్బంధం పరం బ్రహ్మనరాకృతి ।
సౌందర్యసారసర్వస్వం వందే నందాత్మజం మహః॥"

**- శ్రీ మధుసూదన సరస్వతి**

అవతారావశ్యకాన్ని ప్రయోజనాన్ని గురించి నరాకృతిలో అవతరించిన స్వయం భగవానుడు శ్రీ కృష్ణుడు భగవద్గీతలో నిష్కర్షగా వివరించాడు. ఆత్మ సంశయ గ్రస్తమైతే నశిస్తుందిగనుక ("అజ్ఞశ్చాశ్రద్ధ ధానశ్చ సంశయాత్మా వినశ్యతి । నాయంలోకోస్తిన పరోన సుఖం సంశయాత్మనః॥"). సంశయం తొలగించి రక్షించడమే స్వధర్మంగా పాలించే ఆ పరమ పురుషుడు అవతారావశ్యకాన్ని భగవద్గీతలో ఈ విధంగా స్పష్టం చేశాడు:

"యదా యదాహి ధర్మస్యగ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥" IV - 7

కలియుగానికి సన్నిహిత పూర్వయుగం శ్రీ కృష్ణుడవతరించిన ద్వాపర యుగం. ఆనాటి పరిస్థితుల్ని మనం గ్రహిస్తే ఈ అవతారావశ్యకం స్వయం వ్యక్తమవుతుంది. శ్రీ కృష్ణుడవతరించేనాటికి ఆర్యావర్తం మధ్యభాగంలోని మధుర ప్రాంతానికి ప్రభువు కంసుడు. పూర్వ జన్మలో ఇతడు కాలనేమి అనేరాక్షసుడు. ఆ జన్మలో విష్ణువు చేతుల్లో చచ్చిపోయాడు. ఈ జన్మలోకూడా ఆవైరం అంతర్గతంగా ఉండనే ఉంది రాజ్యకాంక్షతో తండ్రిని కారాగారంలో పెట్టిన దుర్మార్గుడు. నవవధువైన తనసోదరి దేవకికి జన్మించే అష్టమ సంతానం తన పాలిటి మృత్యువనివిని, ఆమెను ఆమె భర్తను అప్పటి కప్పుడే చంపయత్నించాడు. నలుగురి ఎదుట చంపి చెడ్డపేరు తెచ్చుకోవడంకంటె, ఆమె శిశువుల్ని రహస్యంగా చంపడం తనకు మంచిదని భావించి ఆ దంపతుల్ని చెరలో పెట్టించాడు. ఆదంపతుల ప్రార్థనల్ని మన్నించినట్లుగా కూడా లోకులను భావింపజేశాడు ! పుట్టిన పసిపాపల్ని నిర్దయతో పాపభీతి లేకుండా చంపుతూవచ్చాడు. ప్రజల్ని

రక్షించవలసిన రాజా ఇలాంటి భక్షకుడు. సాధుజన భయంకరుడు. అధర్మ ప్రవర్తకుడు.

ప్రజారక్షకుడు కావలసిన రాజా ప్రజా భక్షకుడయ్యాడు. కంసుని సేవకులు, మిత్రులు, మంత్రులు, సన్నిహితులు ఇందుకు తగిన వాళ్లే దొరికారు :

"రాజా రాక్షస రూపేణ, వ్యాఘ్ర రూపేణ మంత్రిణః ।
సేవకాశ్శ్వాన రూపేణ, యథారాజా తథా ప్రజా ॥"

ఇలాంటి రాజ్యంలో సాధుజనుల బాధలు అనంతం గదా ! కంసుని మామ జరాసంధుడు. మగధరాజా. పరమ దుర్మార్గుడు. బలవంతుడు. అశస్త్రవధ్యుడు. వివిధ దేశాల రాజుల్ని యుద్ధాల్లో ఓడించి తెచ్చి వాళ్ళను బలి ఇచ్చేవాడు. నర బలిని అభిమానించిన నరరూప రాక్షసుడు. ఆయా రాజుల రాజ్యాల్లో అరాజకం, అల్లకల్లోల పరిస్థితులు చెలరేగి ప్రజలు కష్టనష్టాలకు గురి అయ్యేవాళ్ళు.

ఆనాటి ఇంకో బలవంతుడు నరకుడు. ప్రాగ్జ్యోతిషాధిపతి (ఈనాటి అస్సాం). పదహారువేల మంది కన్యకలను చెరపట్టి తెచ్చిన కామాతురుడు, క్రూరుడు. అదితి చెవుల కమ్మల్ని తెంచితెచ్చిన నీచుడు. ఇంక, హస్తినాపురంలో ధృతరాష్ట్రుని రాజ్యం. జనుషాంధుడైన ఈ రాజా ధర్మం విషయంలోను అంధుడే. లోభ దూషితుడు. మోహ పరవశుడు. ధర్మాన్ని ఎరిగి ఉన్నా దానియందు ప్రవృత్తి లేనివాడు. అధర్మం విషయంలో నివృత్తి లేనివాడు. సరే ! ఇంక ఇతని కొడుకు దుర్యోధనుడు కలిపురుషుని అవతారం. ఈ కొడుకూ ఇతని మిత్రులూ - అందరూ - అధర్మ పరులు. అహంకార దూషితులు. దుర్వ్యసనులు, పట్టుదల తప్ప యుక్తా యుక్త వివేకం లేనివాళ్ళు. పాండవ పత్నికి, రాజమహిషికి, యాజ్ఞసేనికి ద్రౌపదికి జరిగిన పరాభవం ఆనాటి నైతిక పతనానికి ప్రతీక. ఆమె ఆనాటి నారీ లోకానికి ప్రతినిధి. స్త్రీలకు గౌరవ మర్యాదలు, రక్షణ తగ్గుతూ వచ్చిన రోజులవి. విరాట సభలో కూడా ద్రౌపదికి జరిగిన పరాభవం ఆనాటి సమాజంలో స్త్రీల స్థానం అంత ఉన్నతంగా లేదని చెప్పకనే చెప్పుతోంది. సైంధవుని వంటి వాడు కూడా ద్రౌపదిని పరాభవించాడంటే, ఇంక చెప్పవలసింది ఏముంది ! ద్వాపరమంటే సందేహం. ధర్మా ధర్మ విషయంలో ఈ సందేహం ఆనాడందరినీ బాధించినట్లుంది !

ఇంకో దుర్మార్గుడు శిశుపాలుడు. అధర్మం, అన్యాయం, అసహనం మూర్తీభవించిన వ్యక్తి. సాధుసజ్జన ద్వేషి, స్త్రీలోలుడు. కౌరవులకు, జరాసంధునకు మిత్రుడు, భగవద్ద్వేషి. వైకుంఠంలోని జయ విజయులు సనక సనందనాదుల శాపం వల్ల, ద్వాపరంలో శిశుపాల దంతవక్త్రులుగా జన్మించి అధర్మాన్ని పెంచుతూ ఉన్న కాలం అది. వీళ్లే అంతకుపూర్వం - హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా, రావణ కుంభకర్ణులుగా పుట్టి తమ కాలాల్లో అధర్మాన్ని పెంచుతూవచ్చి హరిచేతుల్లో చచ్చి పోయారు. శిశుపాల దంతవక్త్రులు కూడా అవతారమూర్తి చేతుల్లో గాని చావరు.

ఈ విధంగా పరోక్షరాక్షసులైన వీళ్ళు, నరమాంస భక్షకులైన ప్రత్యక్ష రాక్షసులు ప్రబలిన ఆకాలంలో, "రావే ఈశ్వర ! కావవే వరద ! సంరక్షింపు భద్రాత్మకా !" అని అందరూ హాహా కారాలు చేస్తూ ఉంటే పరాత్పరుడు భూభారాన్ని తగ్గించడానికి అవతరించవలసిన అవశ్యకం కలిగింది. కాలం కూడా ఆసన్నమయింది. భగవంతుని పుత్రునిగాకోరి తపస్సుచేసి, వరాన్ని పొందిన దేవకీ వసుదేవులు కారాగారంలో కృశిస్తూ ఉన్నారు. ఇంకా ఎందరో ధర్మాత్ములు నలిగిపోతూ ఉన్న కాలం అది. ధర్మం రెండు పాదాలమీద ఎలాగో నడుస్తూ ఉన్న దుష్కాలం. ఇంతకంటె అవతారావతరణకు మంచికాలం ఎక్కడ ఉంటుంది? హరి శ్రీ కృష్ణునిగా అవతరించాడు. తనకంటె ముందే పుట్టి అధర్మాన్ని పెంచుతూ ఉన్నవాళ్ళు, తనతో బాటు సమకాలికంగా జన్మించి హింసాచరణలో అగ్రగాములైన వాళ్లూ, తానవతరించిన తరవాత బయలు దేరిన దుర్మార్గులు - ఎందరో అందరూ - నశించవలసి ఉంది. కొందరు ఆయన చేతుల్లో చచ్చిపోతే, ఇంకొందరు ఇతరవీరుల చేతుల్లో చచ్చిపోయారు. ఈ పనులు జరగడానికి అవతారావశ్యకం ఎంతైనా ఉంది. అరాజక పరిస్థితుల్నీ, అధర్మ విజృంభణాన్నీ, అన్యాయాన్నీ ఎంతకాలమని సహించి ఉండగలరు. భగవంతుని అస్తిత్వంమీద కూడా అవిశ్వాసం కలిగి, "కలఁడు కలండనెడు వాఁడు కలఁడో లేఁడో" అనే సంశయం వరకు వచ్చారు సాధుజనులు ఆ ద్వాపర యుగంలో.

ఇంక ప్రయోజనం ! శ్రీ కృష్ణుడే అవతార ప్రయోజనాన్ని భగవద్గీతలో ఇలా ప్రవచించాడు :

"పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే ॥" IV - 8